సాక్షి సూర్యాపేట

గురువారం । 4 । సెప్టెంబర్ । 2025



తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలి

పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. - IIలో



టీటీడీ తరహాలో శిక్షణ

యాదగిరిగుట్ట ఆలయ సిబ్బందిని వివిధ అంశాలపై శిక్షణకు టీటీడీకి పంపనున్నట్లు ఈఓ తెలిపారు - IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**586.20** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**86,585** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**50,578** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**32,724** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**9,500** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**5,654** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**2,400** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

రేపు గణేష్ నిమజ్జనం



మాట్లాడుతున్న అనంతుల కృపాకర్

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించాలని భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అనంతుల కృపాకర్, ప్రధాన కార్యదర్శి రంగరాజు రుక్మారావు వెల్లడించారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో దాదాపు 450 విగ్రహాలు ఏర్పాటు చేశారని, నవరాత్రుల పూజలు ఈనెల 4వ తేదీతో ముగుస్తున్నందున 5న గణేష్ నిమజ్జన శోభాయాత్రను నిర్వహించాలని సూచించారు. సూర్యాపేట సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్‌లో విగ్రహాల నిమజ్జనం చేయాలని కోరారు. నిమజ్జన కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ సహకారంతో 14 ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వేదాంత భజన మందిరం మట్టి గణపతి పూజలు ముగిసిన తర్వాత ఊరేగింపుగా పూల సెంటర్ వద్ద శోభాయాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు చల్లమల్ల నరసింహ, దంతాల రాంబాబు, బైరు వెంకన్న, కార్యదర్శి గండూరి రమేష్, భువనగిరి సృజన్, కారింగుల ఉపేందర్, చేకూరి కృష్ణ, కోడి లింగయ్య, గుండా వెంకన్న, మహంకాళి సోమయ్య, బైరు విజయ కృష్ణ పాల్గొన్నారు.

ఈఓగా జయరామయ్య బాధ్యతల స్వీకరణ



ఆలయంలో పూజలు చేస్తున్న అధికారులు జయరామయ, కుశలయ్య

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయ నూతన కార్యనిర్వహణ అధికారిగా జిల్లేపల్లి జయరామయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పదేళ్లుగా ఇక్కడ ఈఓగా పనిచేస్తున్న కుశలయ్య బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో జయరామయ్య వచ్చారు. జయరామయ్య బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఇద్దరు అధికారులను ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

మట్టపల్లిలో విశేష పూజలు

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాయలంలో బుధవారం విశేష పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు ఆలయ ముఖమండపంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం,గర్భాలయంలో శ్రీ మూలవిరాట్‌కు పంచామృతా భిషేకం చేపట్టారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూ వరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేశారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ ,మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

సాహసంతో జీవిద్దాం..

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 'బాలికా చైతన్యం'

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చొరవతో శ్రీకారం
- 'సవాళ్లను అధిగమిద్దాం– సాహసంతో జీవిద్దాం' అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమం
- ఒక్కో వారం ఒక్కో థీమ్‌తో బాలికలకు అవగాహన



భానుపురి (సూర్యాపేట): నేటి సమాజంలో బాలికలు వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ సమర్థంగా తిప్పికొట్టడానికి బాలికా చైతన్యం పేరిట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ప్రత్యేక చొరవతో జిల్లాలో పక్షం రోజుల క్రితం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చదువుతోనే బాలిక ప్రకాశిస్తుందన్న ఆలోచనతో 'సవాళ్లను అధిగమిద్దాం.. సాహసంతో జీవిద్దాం' అనే నినాదంతో పైలట్ ప్రాజెక్ట్‌గా ఈకార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా నెలలో నాలుగు వారాలు.. నాలుగు శాఖల ఆధ్వర్యంలో వివిధ అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒక్కో వారం.. ఒక్కోశాఖ.. ఒక్కో కాన్సెప్ట్

జిల్లాలోని ఐసీడీఎస్, విద్యాశాఖ, ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో పాఠశాలల్లో బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో శాఖ ఒక్కో వారం ఒక్కో ఆలోచనతో ముందుకు వస్తోంది.

- మొదటి వారం: వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో.. పౌష్టికాహారం, బాలికల ఆరోగ్య సమస్యలు, న్యూట్రిషన్ ఫుడ్, హార్మోనల్ బ్యాలెన్స్ తదితర విషయాలపై శిక్షణ ఇస్తున్నారు.
- రెండోవారం: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తారు. హెల్ప్ లైన్ నంబర్లు, సెల్ఫ్ డిఫెన్స్, అనుకోని సమస్య ఎదురైతే ఎలా స్పందించి.. ఎలా రక్షించుకోవాలని..? ఆన్‌లైన్‌లో మోసపోకుండా ఎలా అడ్డుకోవాలి..? అనే అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.
- మూడోవారం: విద్యాశాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ఇవ్వనున్నారు.
- నాలుగో వారం: మహిళా శిశు సంక్షేమశాఖ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో.. పోక్సో చట్టాలు, సఖి కేసులు, తల్లిదండ్రులు, గురువులను గౌరవించడంపై కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు.

సమాజాన్ని అర్థం చేసుకునేలా..

ప్రస్తుత సమాజంలో బాలికలు లైంగిక దాడులు, చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్యలు, ప్రేమ పేరిట మోసాల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో వీరికి చదువు ఒక్కటే కాకుండా సమాజంపై పూర్తి అవగాహన కల్పించేలా కలెక్టర్ సరికొత్త ఆలోచన చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఒక్కో వారం ఒక్కో కాన్సెప్ట్‌తో జిల్లాలోని గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలను గత నెల 19న ప్రారంభించారు. మొదటగా టీచర్లకు వారం రోజుల పాటు శిక్షణ సైతం ఇచ్చారు. అనంతరం ఆయా పాఠశాలల్లో బాలికలకు అవగాహన కల్పిస్తున్నారు.

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి



బాలికలకు చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్న ఉద్దేశంతో బాలికా చైతన్యం కార్యక్రమం చేపట్టాం. అన్ని పాఠశాలల్లోని బాలికలకు ఒక్కో వారం ఒక్కో థీమ్‌తో అవగాహన కల్పిస్తున్నాం. సమాజంలో బాలిక చదువుతోనే వారి భవిష్యత్ ప్రకాశవంతంగా ఉంటుందన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం.

– తేజస్ నంద్ లాల్ పవార్, కలెక్టర్



బాలికా చైతన్యంపై టీచర్లకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ (ఫైల్)

కేసుల పరిష్కారంలో మొదటిస్థానంలో నిలుపుదాం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

చివ్వెంల(సూర్యాపేట) : ఈనెల 13 న నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలుపుదామని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీ శారద పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌పై బుధవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో చిట్ ఫండ్‌కంపెనీలు, బ్యాంకులు, బీమా కంపెనీ, ఆర్‌టీసీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆయా సంస్థల అధికారులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. తద్వారా జిల్లా మొదటి స్థానంలో ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. సంవత్సరాల తరబడి పరిష్కారం కాని రాజీపడే కేసులను పరిష్కరించుకోవచ్చని సూచించారు. దీని వల్ల రెండు వర్గాల వారు గెలిచిన వారు అవుతారని, సమయం, ధనం వృథాకాకుండా ఉంటుందన్నారు. రాజీమార్గమే రాజా మార్గం అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోవు రజిత, జూనియర్ సివిల్ జడ్జి నాగ అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు పాల్గొన్నారు.

భూ భారతి అర్జీలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సూర్యాపేట కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లతో వెబెక్స్ ద్వారా భూభారతి, ప్రజావాణి అర్జీలు, ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా, మీసేవ సర్టిఫికెట్ల పెండింగ్‌పై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఒకవేళ తిరస్కరణకు గురైన అర్జీలకు సరైన కారణాలను వివరించాలన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి ప్రజావాణిల్లో వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. స్లాట్ బుక్ చేసిన లబ్ధిదారులకు ఆ రోజే రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని, ఒకవేళ తహసీల్దార్ అందుబాటులో లేకపోతే డిప్యూటీ తహసీల్దార్ కు ఇన్‌చార్జి ఇవ్వాలన్నారు. పలు ప్రభుత్వ అభివృద్ధి పనులకు కావాల్సిన భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని, హైకోర్టు, సివిల్ కోర్టు, లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీలకు సంబంధించిన కోర్టు కేసులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మీసేవ ద్వారా చేసుకున్న ఆదాయ, కుల ధ్రువీకరణ, రెసిడెన్స్‌లాంటి సర్టిఫికెట్లను పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు ఆమోదం తెలపాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత లేకుండా చూడాలన్నారు. పంచాయతీ సెక్రటరీల ద్వారా గ్రామాల వారీగా సమాచారం తీసుకొని ప్రతి ఇంటికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని అధికారులకు ఆదేశించారు.

సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్ : జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణం పై అంచనా వేసి సరిపడా యూరియా అందుబాటులో ఉంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికారులు యూరియా నిల్వలపై ఎప్పటికప్పుడు సమీక్షించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొప్పుల రజిత, సంఘం జిల్లా నాయకులు షేక్ సైదా, మందాడి రామ్ రెడ్డి, నారాయణ, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసీ, రిఫ్రిజ్‌రేటర్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

భానుపురి (సూర్యాపేట) : నల్లగొండ శివారులోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ పురుషులకు ఏసీ, రిఫ్రిజ్‌రేటర్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు సంస్థ సంచాలకుడు రఘుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు గల నల్లగొండ, సూర్యాపేట, యదాద్రి భువనగిరి జిల్లాల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు సంస్థ ఆఫీ సులో సెప్టెంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవా లని సూచించారు. ఇతర వివరాల కోసం 970 1009265 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- జెడ్పీ సీఈఓ వి.వి.అప్పారావు

పెన్‌పహాడ్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను దూరం చేసుకోవచ్చని జెడ్పీ సీఈఓ వి.వి.అప్పారావు సూచించారు. బుధవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం, అనంతారం గ్రామాలను సందర్శించారు. సింగారెడ్డిపాలెంలో పూర్తయిన పశువుల కొట్టాలతో పాటు నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. అనంతారంను ఇంకుడు గుంతల నిర్మాణానికి పైలట్ గ్రామంగా ఎంపిక చేయగా సందర్శించారు. గ్రామంలో బోర్‌వెల్ రీచార్జ్ స్ట్రక్చర్, ఇంకుడు గుంతల పనులు, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపులు, నీటి తొట్లలో మూడు నాలుగు రోజుల కంటే ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ వెంట ఏపీఓ రవి, ఈసీ మహేష్, టీఏలు ఏకస్వామి, రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు అఖిల్, సోమయ్య, ఎఫ్‌ఏలు జ్యోతి, బేగం ఉన్నారు.



అనంతారంలో మురుగు కాల్వను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వి.వి.అప్పారావు



నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద మంగళవారం రాత్రి ఆధార్‌కార్డులు, పాస్‌పుస్తకాలు పెట్టి పడుకున్న రైతులు

పనులు వదిలేసి రాత్రింబవళ్లు పడిగాపులు

- యూరియా కోసం రైతులకు తప్పని అగచాట్లు
- కేంద్రాల వద్దనే నిద్రపోతున్న దుస్థితి
- నెమ్మికల్ పీఏసీఎస్ వద్ద మూడు రోజులుగా నిరీక్షణ
- బస్తాలు ఎప్పుడు వస్తాయోనని కళ్లు కాయలు కాసేలా ఎదురుచూపు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : యూరియా కోసం రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. వ్యవసాయ పనులు వదులుకొని పీఏసీఎస్‌ల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాల వద్దే చెప్పులు, ఆధార్‌కార్డులు లైన్‌లో పెట్టి నిద్రపోయినా ఫలితం దక్కడంలేదు.

మూడు రోజులుగా ఆధార్‌కార్డులు, పాస్‌బుక్‌లు లైన్‌లో పెట్టి..

ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్, ఆత్మకూర్ పీఏసీఎస్‌లకు నాలుగు రోజుల క్రితం యూరియా రాగా అందరు రైతులకు అందలేదు. దీంతో మళ్లీ యూరియా వస్తే తాము ముందు వరుసలో ఉండాలని మూడు రోజులుగా రైతులు తమ ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలను లైన్లో ఉంచి అక్కడే రాత్రింబవళ్లు ఎదురు చూస్తున్నారు. రాత్రి పూట సైతం మహిళలతో పాటు అక్కడే నిద్రపోతున్నారు. వీరికి ఆ గ్రామాల నుంచి కుటుంబ సభ్యులు భోజనాన్ని, మంచినీటిని పంపిస్తున్నారు. అసలే వ్యవసాయ పనులు బిజీగా ఉన్న సమయంలో పనులు వదులుకొని మహిళా రైతులతో సహా పడిగాపులు కాస్తున్నారు.

నేడు మండలానికి 35 టన్నుల యూరియా

ఆత్మకూర్(ఎస్) మండలంలోని ప్రాథమిక సహకార సొసైటీకి గురువారం 35 టన్నుల యూరియా రానున్నట్లు వ్యవసాయ అధికారి దివ్య తెలిపారు. మండలంలోని ఆత్మకూరుకు 13 టన్నులు, ఏపూరుకు 12 టన్నులు, నెమ్మికల్‌కు 10 టన్నుల చొప్పున యూరియా వస్తుందని, రైతులు సకాలంలో వచ్చి యూరియా కొనుగోలు చేయాలని కోరారు.

మూడు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నాను



నాలుగు ఎకరాల్లో నాటు పెట్టాం. 10 కట్టలు యూరియా కావాలి. నాలుగు రోజుల క్రితం యూరియా దొరకకపోవడంతో ఇక్కడే ఆధార్ కార్డులు లైన్లో పెట్టి ఉంటున్నాం.

– బానోత్ రవి, బోరింగ్‌తండా

రాత్రి ఇక్కడే పడుకోవాల్సి వస్తోంది



యూరియా దొరకక పోవడంతో మూడు రోజుల నుంచి రాత్రిపూట సైతం ఇక్కడే పడుకొని యూరియా కోసం పడిగాపులు కాస్తున్నాం. ఎప్పుడు వస్తుందో ఎవరూ చెప్పడం లేదు.

– తండు వెంకటమ్మ, పాతర్ల పహాడ్

మఠంపల్లిలో రాస్తారోకో



మఠపల్లి: ప్రధాన రహదారిపై సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మఠంపల్లి: యూరియా కోసం మఠంపల్లి మండల కేంద్రంలోని మట్టపల్లి –హుజూర్‌నగర్ ప్రధాన రహదారిపై సీపీఎం,సీపీఐ ఆధ్వర్యంలో రైతులు బుధవారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు, రైతులు మాట్లాడుతూ మండలంలో ఆయకట్టు, చివరి ఆయకట్టు పరిధిలో నెలరోజులుగా వరినాట్లు పెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంతో నాట్లు ఎదుగుదలకు నోచుకోవడం లేదన్నారు. వెంటనే రైతులకు సరిపడా యూరియా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాండునాయక్, మండల కార్యదర్శి బాలునాయక్, సీపీఐ మండలకార్యదర్శి అమరారపు పున్నయ్య, నాయకులు కోటయ్య, లక్ష్మణ్‌నాయక్ , బద్రునాయక్, నాగునాయక్, సురేష్, మగతా, మాంగూ, జెత్రామ్ నాయక్, సైదా తదితరులు ఉన్నారు.

తెల్లవారు జాము నుంచే..

అనంతగిరి: అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ పీఏసీఎస్ గోదాం వద్ద రైతులు యూరియా కోసం తెల్లవారు జాము నుంచే క్యూలైన్‌లో నిలబడి పడిగాపులు కాస్తున్నారు. బుధవారం సుమారు 260 మంది రైతులు వచ్చారు. వీరు క్యూలైన్‌లో నిలబడి అలసిపోయిన చివరికి చెప్పులను ఉంచారు. సుమారు 220 బస్తాల యూరియా రాగా పోలీసుల సహకారంతో అధికారులు ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున అందజేశారు. మిగతా రైతులు నిరాశతో వెనుదిరిగి వెళ్లారు.



అమీనాబాద్ పీఏసీఎస్ గోదాము ఎదుట రైతులు క్యూలైన్‌లో పెట్టిన చెప్పులు

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

సూర్యాపేటటౌన్ : సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని సూర్యాపేట జిల్లా పోలీస్ సైబర్ సెక్యూరిటీ విభాగం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలను ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైబర్ వారియర్స్‌లా పని చేయాలన్నారు. సైబర్ మోసాల పట్ల చుట్టుపక్కల ఉన్న పెద్దలకు విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు సాంకేతికతను ఉపయోగించి వినియోగదారులకు బహుమతుల రూపంలో, లోన్‌ల రూపంలో ఆశ చూపుతూ ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని వారిని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల రాజు, సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బంది మహేష్, సైదులు పాల్గొన్నారు.



సైబర్ మోసాలను ఎదుర్కోవడంపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ

పూర్వ ప్రాథమిక విద్యకు ఆదరణ

- తొలి విడత ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో 600 మంది చిన్నారులు
- ఒక్కో పాఠశాలలో రూ.1.70లక్షలతో వసతులు
- నాలుగు నెలలుగా ఆటపాటలతో బోధన



ఎంపిక చేసిన తిరుమలగిరి ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తెచ్చిన పూర్వ ప్రాథమిక విద్యకు ఆదరణ లభిస్తోంది. ఆట పాటలతో ఆహ్లాదకర వాతావరణంలో పాఠాలు బోధిస్తుండడంతో వీటిలో చేరడానికి పిల్లలు ఆసక్తి కనబరిచారు. జిల్లా వ్యాప్తంగా తొలివిడత ఏర్పాటు చేసిన 30 పాఠశాలల్లో సుమారు 600 మందికిపైగా పిల్లలు చదువుకుంటున్నారు. ఒక్కో పాఠశాలలో రూ.1.70లక్షలతో వసతులు కల్పించారు. దీని కోసం ప్రత్యేకంగా బోధకులు, ఆయాలను నియమించారు.

ప్రవేశాలు పెరిగేలా చర్యలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1వ తరగతి నుంచి విద్య అమలవుతోంది. చాలా మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య పూర్తయిన తరువాత పాఠశాలలో ప్రవేశాలు తీసుకోకుండా ప్రైవేట్‌కు వెళుతున్నారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇక ప్రాథమిక పాఠశాల ఆవరణలో తరగతులు నిర్వహిస్తున్నారు. తొలి విడతలో 30 పాఠశాలల్లో ఏర్పాటు చేశారు.

వసతులు ఇలా..

ఒక్కో పాఠశాలకు రూ.1.70లక్షల చొప్పున మంజూరు చేశారు. వీటి నుంచి రూ.50వేలతో ఫర్నిచర్, రూ.50వేలతో ఇండోర్, ఔట్‌డోర్ సామగ్రి, రూ.70వేలతో తరగతి గదులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో చిన్నారులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక విద్య

మూడు సంవత్సరాలు ఉన్న పిల్లలకు ప్రభుత్వ పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక విద్య అందుతోంది. చిన్నారులకు ఆట, పాటలతో పాఠాలు బోధిస్తున్నారు.

– అశోక్, జిల్లా విద్యాధికారి.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మునగాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద చెరువు ఒడ్డున బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మృతుడు 5.3 అడుగుల ఎత్తు ఉంటాడని, ఆకుపచ్చ రంగు టీషర్ట్ పైనుంచి నలుపు రంగు చెక్స్ షర్ట్ ధరించినట్లు తెలిపారు. అతడి కుడిచేతికి తాయత్తు ఉందని, చిన్న గడ్డం కూడా ఉన్నట్లు గుర్తించామని ఎస్ఐ వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 86011, 87126 86048 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

- మరొకరికి గాయాలు

చిట్యాల: యూటర్న్ తీసుకుంటున్న బైక్‌ను కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చిట్యాల ఎస్ఐ మామిడి రవికుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామానికి చెందిన దేశపాక శ్రీశాంత్(20), చిట్యాల పట్టణానికి చెందిన శివకార్తీక్ మంగళవారం రాత్రి బైక్‌పై చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన గల చెరువు వద్ద యూటర్న్ తీసుకుంటుండగా.. హైదరాబాద్ నుంచి చిట్యాల వైపు అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీశాంత్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. శివకార్తీక్‌ను నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఉమా ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత



స్వాధీనం చేసుకున్న నల్లబెల్లం, పటికను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

డిండి: అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్న వాహనాన్ని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని చెర్కుపల్లి నుంచి తవక్లాపూర్ వెళ్లే మార్గంలో ఇండికా కారులో 450 కేజీల నల్లబెల్లం, 30 కేజీల పటికను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కారును పట్టుకున్నారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నర్సింహ, వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వెండి వస్తువులు, నగదు అపహరించారు. ఈ ఘటన భువనగిరి పట్టణంలోని ఎల్బీనగర్ కాలనీలో బుధవారం మధ్యాహ్నం జరిగింది. బాధితులు ఫిర్యాదు మేరకు భువనగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా భువనగిరి పట్టణంలోని రాంనగర్ కాలనీ సమీపంలోని సెల్ టవర్ వద్ద బ్యాటరీ, ఇతర వైర్లు చోరీకి గురైనట్లు నిర్వాహకులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంతుచిక్కని వ్యాధి.. అంతులేని వ్యథ

- మంచానికే పరిమితమైన ఇంటి పెద్ద
- అన్నీ తానై చూసుకుంటున్న భార్య
- అప్పు చేసి వైద్యం చేయించినా కోలుకోని వైనం
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు

కన్నీటి గాథ

అడవిదేవులపల్లి: సజావుగా సాగుతున్న వారి జీవితం ఒక్కసారిగా కుదేలైంది. భార్యాపిల్లలతో ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబ పెద్దకు అంతుచిక్కని వ్యాధి సోకి మంచానికే పరిమితమయ్యాడు. అప్పు చేసి మరీ వైద్యం చేయించినా ఫలితం లేకపోవడంతో ప్రస్తుతం పూట గడవడమే కష్టంగా మారింది. వివరాలు.. అడవిదేవులపల్లి మండల కేంద్రానికి కలకండ చినసైదులు, మౌనిక భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు హర్షవర్ధన్, అనిర్విణ్య సంతానం. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2023 ఆగస్టులో చినసైదులుకు కుడి చేతి బొటనవేలికి వాపు వచ్చింది. దీంతో స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. రోజుల వ్యవధిలోనే వాపు చేతికి మొత్తం పాకింది. వెంటనే మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అయినా వాపు తగ్గకపోగా.. శరీరం మొత్తం చచ్చుబడిపోయింది. చేతులు, కాళ్లు పనిచేయకపోవడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నాడు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంచానికే పరిమితమయ్యాడు.



భర్తకు అన్నం తినిపిస్తున్న మౌనిక

అప్పులపాలైన కుటుంబం..

రెండేళ్లుగా అంతుచిక్కని వ్యాధితో చినసైదులు పెద్దాస్పత్రుల్లో వైద్యం చేయించుకోవాల్సి వస్తోంది. అతడికి మెరుగైన వైద్యం అందించాలని కుటుంబ సభ్యులు ఇప్పటి వరకు రూ.10లక్షల వరకు అప్పు చేశారు. తమకున్న ఎకరం పొలం, ఇంటి స్థలాన్ని కూడా అమ్ముకున్నారు. ఒక వైపు తెచ్చిన అప్పులు తీర్చలేక, మరో వైపు కుటుంబం గడవడం కష్టంగా మారిందని చినసైదులు భార్య, పిల్లలు కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లలను అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ.. ఇంటి వద్దనే ఉంటూ భర్తకు సేవలు చేస్తోంది మౌనిక. సదరం సర్టిఫికెట్‌లో 82శాతం దివ్యాంగుడని ధ్రువీకరించినా ప్రభుత్వం చినసైదులుకు పింఛన్ మంజూరు చేయలేదని అతడి భార్య వాపోయింది. దయార్ద్ర హృదయులు స్పందించి ఆర్థిక సాయం చేస్తే తన భర్త ఆరోగ్యం బాగుపడుతుందని, తమ కుటుంబం కష్టాల నుంచి గట్టెక్కుతుందని చినసైదులు భార్య మౌనిక వేడుకుంటోంది.

దాతలు ఆదుకోండి సారూ..



నా భర్తకు వైద్యం చేయించడానికి ఇప్పటికే రూ.10లక్షలు అప్పు చేశాం. ఎవరైనా దాతలు 93476 06721 నంబర్‌ను సంప్రదించి మమ్మల్ని ఆదుకోండి సారూ. నా భర్తకు కనీసం పింఛన్ అయినా ఇస్తే మా కుటుంబం గడుస్తుంది. కనీసం వీల్‌చైర్ అయినా అందించండయ్యా. – మౌనిక, చినసైదులు భార్య

కేసీఆర్‌ను బదనాం చేయడానికి కుట్ర



నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట: ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం కమీషన్, సీబీఐ విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్‌ను బదనాం చేయడానికి కుట్ర పన్నుతోందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణంపై సీబీఐతో విచారణ చేయాలని తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రామన్నపేటలో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేశారు. పాత బస్టాండ్ నుంచి సుభాష్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి చిట్యాల–భువనగిరి రోడ్డుపై ధర్నా చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని చిరుమర్తి లింగయ్యతో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం చిరుమర్తి విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రధాని నరేంద్ర మోదీతో లోపాయికారి ఒప్పందం చేసుకొని కేసీఆర్‌ను ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయకుండా, నాణ్యమైన విద్యుత్ ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు బీఆర్ఎస్ శ్రేణులు భయపడవని, అక్రమ కేసులను ధీటుగా ఎదుర్కొంటారని చెప్పారు. అధికారులు, పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలకకుండా రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోచబోయిన మల్లేశం, నీల దయాకర్, కమ్మంపాటి శ్రీనివాస్, బొక్క మాధవరెడ్డి, బద్దుల ఉమారమేష్, వేమవరపు సుధీర్ బాబు, దోమల సతీష్, సాల్వేరు అశోక్, బందెల యాదయ్య, ఎండీ ఆమేర్, ఎస్కే చాంద్, కన్నెబోయిన బలరాం, బత్తుల వెంకటేష్, మిర్యాల మల్లేశం, బొడ్డు అల్లయ్య, గర్దాసు విక్రం, మామిండ్ల అశోక్, బుర్ర శ్రీశైలం, గంగుల రాఘవరెడ్డి, పున్న వెంకటేశం, ధర్నె భాస్కర్, ఎడ్ల రామచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జంగిలి నర్సింహ పాల్గొన్నారు.

వాంగ్మూలం ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- కల్వకుంట్ల కవితకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచన

సాక్షి,యాదాద్రి: బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండైన కల్వకుంట్ల కవిత కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నామని, ఆమె సీబీఐకి వాంగ్మూలం ఇచ్చి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి సూచించారు. బుధవారం యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని జలగల్లా ఐదుగురు కలిసి దోచుకున్నారని, అందులో కవిత కూడా ఉందని ఆరోపించారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు ఇంట్లో బంగారం ఉంటే బంగారు తెలంగాణ ఎట్లా అవుతుందని కవిత చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని అన్నారు. కవిత ఆరోపించినట్లు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, సంతోష్‌రావు అవినీతి చేస్తుంటే చూస్తున్న కేసీఆర్ కూడా అవినీతిపరుడే కదా అని ప్రశ్నించారు. దోచుకున్న అవినీతి సొమ్ము పంపకాల్లో పంచాయితీతోనే కవిత బయటకు వచ్చారని ఆరోపించారు. కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ త్వరితగతిన పూర్తిచేసేలా చొరవ చూపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావును కాపాడే ఉద్దేశం ఉంటే కాళేశ్వరం అవినీతిపై సీబీఐ ఎంక్వైరీ ఎందుకు వేస్తాడని ఎంపీ అన్నారు. అనంతరం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారని చెప్పేందుకు కవితనే మొదటి ఎవిడెన్స్ అని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి సీబీఐ ఎంక్వైరీ వేయడాన్ని అసెంబ్లీ సాక్షిగా అన్ని పార్టీలు ముక్తకంఠంతో సమర్థించాయని, కానీ బీజేపీ మాత్రం సమర్థించలేదని ఆరోపించారు. అనంతరం భువనగిరి పట్టణంలో జరుగుతున్న ఎంఎంటీఎస్ పనులను వారు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎంఎంటీఎస్ నిర్మాణానికి కేంద్రం రూ.420 కోట్లు నిధులు మంజూరు చేసిందని, త్వరగా పూర్తయితే యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు.



భువనగిరిలో ఎంఎంటీఎస్ పనులను పరిశీలిస్తున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కోదాడరూరల్: బొలేరో వాహనంలో అక్రమంగా పశువులను తరలిస్తుండగా కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్‌లో బుధవారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గుడిబండకు చెందిన బొలేరో డ్రైవర్ బాలేబోయిన వీరబాబు, పశువుల వ్యాపారి వెంకన్న ఖమ్మం జిల్లా వైరా పరిసర ప్రాంతాల్లో 10 పశువులను కొనుగోలు చేసి, ఎలాంటి అనుమతులు లేకుండా బొలేరో వాహనంలో కోదాడ పశువుల సంతకు వస్తుండగా.. మార్గమధ్యలో రామాపురం క్రాస్ రోడ్‌లో బుధవారం తెల్లవారుజామున వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. పశువులను గోశాలకు తరలించి డ్రైవర్ వీరబాబు, పశువుల వ్యాపారి వెంకన్న, వాహన ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



పొలాల్లోకి వెళ్లిన కారు

నార్కట్‌పల్లి: వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి నుంచి మునుగోడు వెళ్తున్న కారు మార్గమధ్యలో బ్రాహ్మణ వెల్లంల గ్రామ శివారులో రోడ్ క్రాసింగ్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకుండా క్షేమంగా బయటపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: పరిశోధన పరిభాష తరగతి గదుల్లో ప్రతిధ్వనించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంజీయూలో గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మ్యాథమెటికల్ అప్లికేషన్స్‌పై నిర్వహించిన జాతీయ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు.గణితశాస్త్రం నిత్య జీవితంలో మానవాళికి అనేక రకాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధునిక సమాజ నిర్మాణంలో గణితం పాత్ర విడదీయరానిదని అన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ.. సమాజ దశ దిశను నిర్దేశించగల శక్తి ఉన్నత విద్యకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, డి. శ్రీనివాసచార్య, పద్మనాభరెడ్డి, చందూలాల్, మద్దిలేటి, ప్రేమ్‌సాగర్, అన్నపూర్ణ, ఉపేందర్‌రెడ్డి, హైమావతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పరిశోధనలే కీలకం

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు పరిశోధనలే కీలకమని, ప్రతి విద్యార్థి పరిశోధనల ద్వారా తన ప్రతిభను నిరూపించుకోవాలని మహాత్మా గాంధీ యూనివర్సిటీ(ఎంజీయూ) వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. ఎంజీయూలోని సైన్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ ఎల్ఈడీ స్క్రీన్‌లో ఎంజీయూలోని వివిధ విభాగాల్లో జరిగే విద్యా కార్యక్రమాలు, ప్రగతి సమాచారం, విశ్వవ్యాప్తంగా జరిగే పరిశోధనల సమాచారం ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి ఆలయ సిబ్బందికి టీటీడీ తరహాలో శిక్షణ

- త్వరలో తిరుపతికి పంపనున్నట్లు వెల్లడించిన ఈఓ వెంకట్రావ్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ సిబ్బందికి టెక్నికల్ మేనేజ్‌మెంట్, రెగ్యులర్ మేనేజ్‌మెంట్, కౌంట్ మేనేజ్‌మెంట్ అంశాలపై శిక్షణ ఇప్పించేందుకు గాను త్వరలో తిరుమల తిరుపతి దేవస్థానానికి పంపించనున్నట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. యాదగిరిగుట్ట పైన తన కార్యాలయంలో ఆలయ అధికారులు, సిబ్బందితో బుధవారం రాత్రి ఈఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీటీడీలో అడ్మినిస్ట్రేషన్ పరంగా అవలంబిస్తున్న విధివిధానాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు, టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట క్షేత్రంలో కంప్యూటరైజేషన్ ఏవిధంగా అమలు చేయాలనే అంశాలపై సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చేందుకు దశలవారీగా పంపనున్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట ఆలయాన్ని టెక్నికల్‌గా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా టీసీఎస్ తదితర సంస్థల సేవలు వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా దేవస్థానంలో నెట్‌వర్క్ సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ సంస్థను సంప్రదించి సమస్యను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు ఈ ఆఫీసును విస్తృతంగా ఇంప్లిమెంట్ చేసేందుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డిప్యూటీ ఈఓ భాస్కర్‌శర్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామారావు, సీఎస్ఓ, ఏఈఓలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈఓ వెంకట్రావ్

వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం

తుంగతుర్తి : ఎక్సైజ్ తనిఖీల్లో, క్రైం కేసుల్లో స్వాధీనం చేసుకున్న ఆరు వాహనాలకు బుధవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలం ద్వారా జీఎస్టీతో కలుపుకొని రూ.1,04,548 ఆదాయం వచ్చినట్లు సీఐ రజిత తెలిపారు.


ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

చిట్యాల: చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్‌లో గతంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి ప్రస్తుతం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న గోగికార్ మాధవిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు బుధవారం నల్లగొండ డీఈఓ భిక్షపతి ఉత్తర్వులు జారీ చేసినట్లు చిట్యాల ఎంఈఓ పానుగోతు సైదానాయక్ తెలిపారు. గతంలో ఇన్‌చార్జి హెచ్‌ఎంగా మాధవి పనిచేసిన సమయంలో పాఠశాలకు మంజూరైన పీఎంశ్రీ నిధుల దుర్వినియోగానికి గురైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. డీఈఓ ఆదేశాల మేరకు విచారణకు వెళ్లిన అధికారులపై మాధవి దురుసగా ప్రవర్తించి వాగ్వాదానికి దిగింది. దీంతో సంబంధిత విచారణ అధికారులు ఈ సంఘటనపై డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో శాఖా పరమైన చర్యల్లో భాగంగా డీఈఓ మాధవిని ఉద్యోగ సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- మూడు గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

కేతేపల్లి: ఎగువ ప్రాంతాల నుంచి మూసీ ప్రాజెక్టుకు బుధవారం సాయంత్రం వరకు 1,971 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు మూడు క్రస్టు గేట్లను పైకెత్తి 2,340 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువలకు 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో ప్రస్తుతం 643.60 అడుగుల మేర నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.11 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకుపోతున్న నీరు

రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ధర్నా



సంస్థాన్ నారాయణపురం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, నాయకులు

సంస్థాన్ నారాయణపురం: హెచ్ఎండీఏ ప్రకటించిన రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాలకు రైతులు, నిర్వాసితులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సాగు భూములు తీసుకొని తమ పొట్టకొట్టొద్దన్నారు. ఈ అలైన్‌మెంట్‌తో తీవ్రంగా నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుకు భూమి తీసుకుంటే మార్కెట్ విలువ ఆధారంగా డబ్బులు చెల్లించాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలని, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రైతులకు వివిధ రాజకీయ పార్టీ నాయకులు పల్లె పుష్పారెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్రి నర్సింహ్మ, చిలువేరు అంజయ్య, దోనూరి నర్సిరెడ్డి, తుమ్మల నర్సిరెడ్డి, నెల్లికంటి రాములు తదితరులు సంఘీభావం తెలిపారు.

టిప్పర్ ఢీకొని మృతి



వెంకటేశ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ రూరల్: టిప్పర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూదాన్‌పోచంపల్లి మండలం జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన బోళ్ల వెంకటేశ్‌యాదవ్(52) వ్యవసాయంతో పాటు టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో తన బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్వగ్రామానికి వస్తుండగా.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామ స్టేజీ వద్ద ఎదురుగా వచ్చిన టిప్పర్ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌యాదవ్ తలకు తీవ్రగాయమై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు అతడిని కారులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు అతడి తలకు శస్త్ర చికిత్స చేశారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, వివాహితులైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు లోకేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ ఎస్ఐ కృష్ణమల్ నూర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

అధిక వర్షాలు.. ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు

పాడిపంట

గుర్రంపోడు: గత కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు పండ్లు, పూలు, కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. వరుస వర్షాలతో ఆశించే వ్యాధికారక శిలీంద్రాలు, చీడపీడలను తగ్గించడానికి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు టి. సురేష్‌రెడ్డి చెబుతున్నారు. ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు ఆయన మాటల్లోనే..

పండ్ల తోటల్లో..

అధిక వర్షాలకు కుంటలు, కాల్వలు, వరి సాగు ఉన్న చోట నీరు ఉబికి పండ్ల తోటల్లోకి రాకుండా చుట్టూ గాడి తవ్వుకోవాలి. చనిపోయిన మొక్కలను తొలగించి కొత్తవి నాటుకోవడం, వాలిపోయిన మొక్కలను సరిచేసి మొదలుకు మట్టిని ఎగదోసి కర్రతో ఊతమివ్వాలి. తర్వాత 19:19:19 నీటిలో కరిగే పాలీఫీడ్ ఎరువును ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే మొక్క చుట్టూ మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని నేలలో ఇంకేలా పోయాలి. గాలులకు విరిగిపోయిన చెట్ల కొమ్మలను కత్తిరించి చివర్లకు కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను పూయాలి లేదా మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణాన్ని లీటరు నీటికి చొప్పున కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేయాలి. మామిడిలో చీడపీడల ఉధృతిని తగ్గించడానికి ఒక గ్రాము కార్బండిజమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగుల నివారణకు ఇమిడాక్లోపిడ్ 0.3 మిల్లీలీటరును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. 10 గ్రాముల మల్టీకే మందును మరియు బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



మామిడి తోటలో నిలిచిన నీరు

కూరగాయ పంటల్లో..

పడిపోయిన కూరగాయ మొక్కల చుట్టూ మట్టిని ఎగదోసి నిలబెట్టాలి. మొక్కలు ఆకులు, కొమ్మలతో ఏపుగా ఉంటే 0.3 శాతం 13:0:45 నీటిలో కరిగే మల్టీకే లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని మొక్కలపై పిచికారీ చేయాలి. ఆయా కూరగాయల రకాలను బట్టి అవసరమైన పురుగు నివారణ మందులు పిచికారీ చేయాలి.

మిరప తోటల్లో..

వర్షాకాలంలో మిరపలో వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. దీని నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందు లీటరు నీటికి కలిపి నారుమడి మొత్తం పిచికారీ చేయాలి. కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బండిజమ్ ఒక గ్రామును లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి. మొక్కలు ఏపుగా పెరిగి ఉంటే 2 శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

పూల తోటల్లో..

మొక్కలపై ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రాఫికొనజోల్ ఒక మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 1–2 పర్యాయాలు పిచికారీ చేయాలి. కోతకు వచ్చిన పూలను వెంటనే కోయాలి. గాలి, వెలుతురు ఉన్న ప్రదేశంలో పూలను నిల్వ చేయాలి.